క్లుప్తంగా

జీరో బిల్ రావడం లేదని ఫిర్యాదు

బిజినేపల్లి: మండలంలోని వట్టెం గ్రామానికి చెందిన పలువురి లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ అమలు కావడం లేదని గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామజ్యోతి పథకంలో భాగంగా దరఖాస్తు చేసినా ఫలితం లేదని, విద్యుత్‌శాఖ, ఎంపీడీఓ కార్యాలయాల్లో ఎన్నోసార్లు దరఖాస్తు చేసినా జీరో బిల్ రావడం లేదని గ్రామస్తులు శంకర్, మహేష్, జ్యోతిలు వివరించారు.

అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడిగా షేక్ మక్సూద్

కందనూలు: నాగర్‌కర్నూల్ నియోజకవర్గ ముస్లిం అడ్వైజరీ(ముషావిరత్) కమిటీ అధ్యక్షుడిగా షేక్ మక్సూద్‌ను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని జామా మసీదులో ముస్లిం పెద్దలు యువకులు, వివిధ ముస్లిం సంఘాల బాధ్యులు సమావేశమై ఏకగ్రీవంగా షేక్ మక్సూద్‌ను ఎన్నుకున్నారు. ముస్లిం అడ్వైజరీ కమిటీని బలోపేతం కోసం కృషి చేస్తానని మక్సూద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌కు అవార్డులు



అచ్చంపేట రూరల్: వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించిన అచ్చంపేట లయన్స్‌క్లబ్ ప్రతినిధులకు ఉత్తమ డిస్ట్రిక్ట్ మల్టిపుల్ క్లబ్ అవార్డులు వరించాయి. ఉత్తమ ప్రెసిడెంట్‌గా మొక్తాల వెంకటేష్, బెస్ట్ జోన్ చైర్మన్‌గా శివ్వ శ్రీనివాస్, ఉత్తమ కార్యదర్శిగా పోల శ్రీనివాసులు అవార్డులు అందుకున్నారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ కోటేశ్వర్‌రావు, సభ్యులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన ఏటవాలి రవి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామానికి చెందిన శెట్టి రాజేష్, విష్ణువర్ధన్‌రెడ్డిలు సోమవారం బాధిత కుటుంబానికి రూ.5000 ఆర్థికసాయం అందజేశారు. వారం రోజుల క్రితమే ఏటవాలి రవి తండ్రి అనారోగ్యంతో మరణించడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఉప్పిగంటి యాదయ్య, వెంకటేష్, చంద్రశేఖర్, చిన్నయ్య, వీరస్వామిలు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

మర్రిని ప్రజలే నల్లమలకు పంపారు

తిమ్మాజిపేట: మర్రి జనార్దన్‌రెడ్డిని ఎన్నికల్లో ఓడించి నల్లమలకు పంపారని రాష్ట్ర టెలికాం బోర్డు సభ్యుడు శ్రీనివాస్ బహదూర్ ఎద్దేవా చేశారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నల్లమల పులి బిడ్డగా పేరు తెచ్చుకున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల ఒక్కొక్కటిగా సమస్యలు పరిష్కరిస్తూ పాలన చేస్తున్నారన్నారు. పాలమూరు ప్రాజెక్టుపై సీఎం చిత్తశుద్ధితో ఉన్నారన్నారు. సీఎంపై విమర్శలు చేస్తూ చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భీమయ్య, బుచ్చిరెడ్డి ఉన్నారు.

కోడ్ కూసింది ఫ్లెక్సీ తొలగింపు



అచ్చంపేట రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో సోమవారం అధికారులు అప్రమత్తం అయ్యారు. పట్టణంతో పాటు, గ్రామాలలో ఉన్న వివిధ పార్టీల ఫ్లెక్సీలు తొలగించారు. విగ్రహాలకు ముసుగులు వేశారు. గోడలపై ఉన్న రాతలపై సున్నంతో తుడిపివేశారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా లక్ష్మణ్

కొల్లాపూర్: మండలంలో కుడికిళ్ల గ్రామానికి చెందిన బచ్చలకూర లక్ష్మణ్ సోమవారం ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలి

కల్వకుర్తి రూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఉద్యోగ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మునగాల సంతోష్ అడిషనల్ కలెక్టర్ దేవ సహాయంతో పాటు కలెక్టర్ సంతోష్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో పాటు ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు 70 శాతం ఉన్నారని ఆరు నెలలల్లో పదవీ విరమణ చేయనున్న ఉద్యోగ ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి దూరంగా ఉంచాలని కోరారు.



పెద్దకొత్తపల్లిలో పూజలు చేస్తున్న భవానీ మాలదారులు



తాడూరు మండలం సిర్సవాడలో..



కొల్లాపూర్‌లో వరిదేల శమీవృక్షం వద్ద చిన్నారులకు అక్షరాభ్యాసం

అమ్మా.. ఆశీర్వదించు



ఉప్పునుంతలలో



నాగర్‌కర్నూల్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి



నాగర్‌కర్నూల్‌లో..



దోమలపెంటలో..



కల్వకుర్తిలో సరస్వతి దేవిగా వాసవీమాత

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మండపాలలో కొలువుదీరిని అమ్మవారిని సోమవారం ఎనిమిదో రోజు వివిధ రూపాలలో అలంకరించారు. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో అమ్మవారు సరస్వతి దేవిగా అలంకరించగా ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి దర్శించుకున్నారు. కొల్లాపూర్ వరిదేల శమీవృక్షం వద్ద చిన్నారులకు అక్షరాభ్యాసం ఏర్పాటు చేశారు. తాడూరులో దుర్గామాతను మహాలక్ష్మిగా అలంకరించారు. సిర్సవాడలో హోమాలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. కల్వకుర్తిలో సరస్వతి దేవికి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస రెడ్డిలు పూజలు చేశారు. అమ్మవారికి మహిళలు ఒడిబియ్యం పోశారు. లింగాల మండల కేంద్రంలోని పాత బజార్‌లో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. చారకొండ మండలంలోని జూపల్లిలో వెల్దండ సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్ఐ శంషోద్దీన్ ప్రత్యేక పూజలు చేశారు. పెద్దకొత్తపల్లి, కోడేరు, దోమలపెంట, ఉప్పునుంతల మండలాల్లో అమ్మవారు సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు.



లింగాలలో..





కల్వకుర్తి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, చారకొండలో

ఒక్కేసి పువ్వేసి చందమామ..



అచ్చంపేటలో పెద్ద బతుకమ్మతో ఎమ్మెల్యే వంశీకృష్ణ, మహిళలు



నాగర్‌కర్నూల్‌లో బతుకమ్మకు హారతి ఇస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్



బతుకమ్మ ఆడుతున్న వైద్య సిబ్బంది

అచ్చంపేట రూరల్: పట్టణంలోని రాజీవ్– ఎన్టీఆర్ మినీస్టేడియం సమీపంలో సోమవారం రాత్రి బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ సంఘాల మహిళలు, వివిధ శాఖల నుంచి అధికారులు, మహిళా అధికారులు బతుకమ్మలను పేర్చారు. చిన్న, పెద్ద తేడా లేకుండా బతుకమ్మ ఆడారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ అనురాధ, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ నాగరాజు, ఎస్ఐలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో..

కోడేరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మహిళలు బొడ్డెమ్మలు, ఆట పాటలతో సందడి చేశారు. డాక్టర్ అనిల్‌కుమార్, సీహెచ్ఓ సుదర్శన్, ఫార్మాసిస్టు దిలీప్‌కుమార్, ల్యాబ్ టెక్నిషియన్ నారాయణ, శ్రీనివాస్, సురేష్, రఘు, రాజేష్, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు బతుకమ్మ సంబరాలలో ఎస్పీ గైక్వాడ్ రఘునాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బతుకమ్మకు హారతి ఇచ్చి పూజలు చేశారు. మొత్తం 22 పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న సిబ్బంది కుటుంబసభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమలో జిల్లా అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది సోమవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. పలురకాల పూలతో బతుకమ్మలను పేర్చి వైద్య కేంద్రం ఆవరణలో బతుకమ్మ పాటలు పాడుతూ లయబద్ధంగా ఆడారు. సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడుకుందామని వారు అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి స్వప్న, నర్సింగ్ ఆఫీసర్ ఉఫత్, సూపర్‌వైజర్ ప్రభావతి, పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఇఫ్కో ప్రైవేటు ఎరువుల దుకాణం వద్ద రైతులు సోమవారం యూరియా కోసం బారులు తీరారు. ఒక లారీ యూరియా వచ్చిందన్నా సమాచారంతో రైతులు ఒక్కసారిగా పోటెత్తారు. వంద మంది రైతులు క్యూలో నిల్చొని ఒక్కొక్క రైతుకు రెండు బస్తాల యూరియాను అందించారు. రైతులు యూరియా అవసరం లేకున్నా వచ్చే యాసంగి సీజన్‌లో యూరియా దొరుకుతుందో లేదోనని ముందుజాగ్రత్తగా యూరియా బస్తాలను తీసుకెళ్లి ఇళ్లలో స్టాక్ చేసుకుంటున్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలి



నాగర్‌కర్నూల్ క్రైం: పోలీసు శాఖకు సంబంధించిన పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలని అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పలు విభాగాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఎవరూ నిర్లక్ష్యం వహించొద్దన్నారు. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారికి అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదల వరం

అచ్చంపేట/చారకొండ: సీఎంఆర్‌ఎఫ్ పేదల వరంగా మారిందని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. అచ్చంపేట బీఆర్ అంబేద్కర్ ప్రజా భవన్‌లో చారకొండ, తిమ్మాయిపల్లి, సిర్సనగండ్ల, అగ్రహారం తండా, సారంబండ తండా, తుర్కలపల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. గ్రంథాలయ చైర్మన్ గంగాపురం రాజేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బాల్‌రాం గౌడ్, సీఎంరెడ్డి, శ్రీనివాసులు, భరత్‌కుమార్, చింతల రాజ్‌గోపాల్ పాల్గొన్నారు.

కాషాయ జెండాల ఏర్పాటు

కల్వకుర్తి రూరల్: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని అన్ని కూడలిలో ప్రధాన రహదాలలో కాషాయ తోరణాలను, జెండాలను ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో హిందూ ఐక్యవేదిక నాయకులు స్తంభాలపై, దారిపొడవునా జెండాలను కడుతున్నారు.

భారతి సిమెంట్ నాణ్యమైనది



కల్వకుర్తి రూరల్: భారతి సిమెంట్ నాణ్యమైనది టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్ అన్నారు. 13 దేశాలలో సిమెంట్ వ్యాపారం విస్తరించి ఉందన్నారు. కల్వకుర్తిలో ఆర్కే డీలర్ ఆధ్వర్యంలో బిల్డర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికాట్ గ్రూప్ కంపెనీకి చెందిన భారతి సిమెంట్ నాణ్యతకు మరో పేరుగా నిలుస్తుందన్నారు. వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో బ్రాంచ్ మేనేజర్ నాగేశ్వరరావు, సేల్స్ మేనేజర్ భరత్‌కుమార్, డీలర్ కరుణాకర్ రెడ్డి, బిల్డర్లు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ

వెల్దండ: మండలంలోని కుప్పగండ్లలో రైతులకు ప్రభుత్వం సబ్సిడీలో మంజూరు చేసిన వేరుశనగా విత్తనాలను సోమవారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి 90 కెజీల చొప్పున పూర్తి సబ్సిడీతో విత్తనాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. సీసీ విమల, సీఈఓ శరత్, ఏఈఓ హబీబున్నిస్సా, గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రమేష్ ముదిరాజ్, శివరాజుగౌడు, రమేష్‌గౌడు, శ్రీధర్, వీఓలు స్వప్న, అంజయ్య, శ్రీశైలం ఉన్నారు.

రణభేరిని విజయవంతం చేయాలి

మన్ననూర్: హైదరాబాద్‌లో నవంబర్ 2వ తేదీన నిర్వహించే మాలల రణభేరి మహాసభను విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల దివాకర్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉద్యమాలతోనే హక్కులు సాధ్యమన్నారు. నాయకులు, తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరు కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి

తెలకపల్లి: ప్రతి ఒక్కరు కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. వారం నుంచి సీఎల్ఆర్ కళాశాలలో హైదరాబాద్‌లోని శంకర్ నేత్రలయా సహకారంతో దాసుపల్లి గ్రామానికి చెందిన చిమర్ల జగదీశ్వర్‌రెడ్డి, హేమలత ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం కొనసాగుతోంది. సోమవారం శిబిరం ముగింపు సందర్భంగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ప్రతి సేవ దృక్పథం అలవర్చుకోవాలన్నారు. దాతలను అభినందించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, సింగిల్ వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, నాయకులు రమేష్‌రెడ్డి, రాజమహేందర్‌రెడ్డి, మురళీధర్, నిర్వాహకులు పాల్గొన్నారు.

కళ్లను నిర్లక్ష్యం చేయొద్దు

నాగర్‌కర్నూల్ క్రైం: కళ్లను నిర్లక్ష్యం చేయొద్దని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డా.నీరజ్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగశాఖ, అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. తాజా ఆకుకూరలు, పళ్లు తీసుకోవాలన్నారు. కంటి పరీక్షా శిబిరంలో 68 మందికి పరీక్షలు నిర్వహించి 23 మందికి కంటి ఆపరేషన్‌లు అవసరం ఉన్నట్లు గుర్తించారు. ఆప్తాలమిక్ అధికారి వీరమళ్లు, బాలాజీ, వెంకటస్వామి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది నర్సింహ, శ్రీనివాసులు, సుకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లో కంటిని పరీక్షిస్తున్న వైద్యుడు నీరజ్‌కుమార్

టీజీపీఎస్సీ ఫలితాల్లో బిజినేపల్లి యువతి సత్తా



తల్లిదండ్రులతో ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఉద్యోగం సాధించిన స్వప్న

బిజినేపల్లి: టీజీపీఎస్సీ రెండు రోజుల క్రితం విడుదల చేసిన ప్రభుత్వ ఉద్యోగ ఫలితాల్లో బిజినేపల్లికి చెందిన కందె తిరుపతయ్య, మణెమ్మ కుమార్తె స్వప్న మహిళా శిశు సంక్షేమ శాఖలో ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (సూపర్‌వైజర్ గ్రేడ్- 1) ఉద్యోగానికి ఎంపిక కావడం జరిగింది. స్వప్న ప్రస్తుతం నాగర్‌కర్నూల్ మండలంలోని కుమ్మెరతండాలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. అటు ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తూనే.. టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షకు హాజరై జోగుళాంబ జోన్‌-7లో మూడో ర్యాంకు సాధించింది. కొన్నినెలల తేడాతో రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంపై గ్రామస్తులు స్వప్నని అభినందించారు. వ్యవసాయం చేస్తూనే తన తల్లిదండ్రులు తనను ఉన్నత విద్య చదివించారని, వారితోపాటు భర్త సహకారంతో రెండు ఉద్యోగాలు సాధించగలిగానని స్వప్న పేర్కొన్నారు.

గ్రూప్ –2లో అమ్రాబాద్ వాసి ప్రతిభ



రాజీవ్

అమ్రాబాద్: ఇటీవల విడదలైన ఫలితాలలో మండలంలోని మాధవానిపల్లి గ్రామానికి చెందిన బాల్‌సాయిలమ్మ ఆశీర్వాదం కుమారుడు రాజీవ్ ఎంపీఓగా ఉద్యోగం సాధించాడు. రాజీవ్ ప్రస్తుతం కమర్శియల్ టాక్స్ అధికారిగా పని చేస్తున్నాడు. గ్రూప్ 2 ఉద్యోగం రావడంపై తల్లి దండ్రులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

గ్రూప్ వన్‌లో ఉద్యోగం



సౌమ్య(ఫైల్)

కల్వకుర్తి రూరల్: పట్టణానికి చెందిన ఆత్మకూరు సౌమ్య ఇటీవల విడుదల అయిన గ్రూప్- 1 లో అంగన్‌వాడీ గ్రేడ్ వన్ సూపర్‌వైజర్‌గా ఉద్యోగం సాధించింది. సోమవారం కల్వకుర్తిలో సౌమ్యను మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌తో పాటు మున్సిపల్ మాజీ చైర్మన్లు ఎడమ సత్యం, రాచోటి శ్రీశైలం వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ జూలూరు రమేష్ బాబు తదితరులు అభినందించి ఘనంగా సత్కరించారు.

క్రీడలతో మానసికోల్లాసం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న సీబీఎం ట్రస్టు చైర్‌పర్సన్ డాక్టర్ అనురాధ

అమ్రాబాద్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని సీడీఎం ట్రస్టు చైర్‌పర్సన్ డాక్టర్ అనురాధ అన్నారు. సీబీఎం ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ మైదానంలో ఉమ్మడి(అమ్రాబాద్, పదర) అమ్రాబాద్ మండల స్థాయి వాలీబాల్ టోర్నిని సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపుఓటములు సహజమన్నారు. అనంతరం అమరేశ్వరాలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలోని మొల్కమామిడిలో మన ఊరు మనమందరం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ వైస్ఎంపీపీ సంబుశోభ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరినారాయణగౌడ్ ఉన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్‌లో దసరా పండుగను పురస్కరించుకొని సోమవారం క్రికెట్ పోటీలను ముదిరాజ్ సంఘం నాయకుడు సత్యం ముదిరాజ్ ప్రారంభించారు. వర్గాల దేవయ్య, బచ్చలకూర శ్రీశైలంలు క్రికెట్ దుస్తులను అందించారు.

విద్యుత్ లైట్ల పంపిణీ

వెల్దండ: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీకి సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్ సొంత ఖర్చులతో రూ.లక్ష విలువ చేసే 100 ఎల్ఈడీ విద్యుత్ లైట్లను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు రషీద్, పురుషోత్తంచారి, పుల్లయ్య, నారాయణ, కార్యదర్శి గిరి తదితరులు ఉన్నారు.

పారదర్శకత పాటించాలి



నాగర్‌కర్నూల్: ఇటీవల గ్రూప్–1 ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకు సాధించిన ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం నాగర్‌కర్నూలు జిల్లాకు కేటాయించింది. రాష్ట్ర స్థాయిలో 6వ ర్యాంకు, 124వ ర్యాంకు సాధించిన నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన పి. హర్షవర్ధన్, కుట్రాల్ పాల్ గ్రామానికి చెందిన టి. అశోక్‌లను డిప్యూటీ కలెక్టర్లుగా ఎంపికై నాగర్‌కర్నూల్ జిల్లాకు వచ్చారు. సోమవారం వారు కలెక్టర్ బాదావత్ సంతోష్‌ను కలిసి బాధ్యతలు స్వీకరించారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి

తాడూరు: మండలంలోని అంతారంలో సర్దార్ భగత్‌సింగ్ 118వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు భరత్ పూలమాల వేసి నివాళులర్పించారు. కృష్ణయ్య, స్వామి, జక్కయ్య, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మి వృక్షం పునఃప్రతిష్ఠ

పెద్దకొత్తపల్లి: గంట్రావుపల్లిలో సోమవారం జమ్మి వృక్షాన్ని పునర్‌ప్రతిష్ఠించారు. స్థలదాత మాజీ పట్వారీ కరుణం వెంకటకిషన్‌రావును సన్మానించారు. కరుణం సుధాకర్‌రావు, లక్ష్మణ్‌రావు, చిన్నయ్య, శ్రీనివాసరావు, రంగారావు, ప్రకాశ్‌రావు, సాయిరాం, యాదగిరి, గజేంద్ర, ప్రసాద్, బాలస్వామి పాల్గొన్నారు.

ప్రతాప్ కౌటిల్యకు సాహితీ కిరీటి పురస్కారం



బిజినేపల్లి: పాలెం కళాశాల విశ్రాంత అధ్యాపకుడు డా.ప్రతాప్ కౌటిల్యకు హైదరాబాద్ బిర్లా ఆడిటోరియంలో సోమవారం సాహితీ కిరిటీ జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. కవి రచయిత ప్రతాప్ కౌటిల్యను కళావేదిక ఆధ్వర్యంలో సంస్థ సీఈఓ డా. కత్తిమండ ప్రతాప్, జాతీయ కార్యదర్శి ఈశ్వరీ భూషణం చేతుల మీదుగా సాహితీ పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో ప్రముఖ కవి నాళేశ్వరం శంకరం, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ డా.బాలకృష్ణారెడ్డి, ఉన్నత విద్యాశాఖ సంయుక్త సంచాలకులు డా.రాజేందర్‌సింగ్‌లు పాల్గొన్ని అభినందించారు.

నిజాయితీ చాటుకున్న చిన్నారులు



లింగాల: రోడ్డు మీద దొరికిన వెండి వస్తువును పోలీసు స్టేషన్‌లో అప్పగించి చిన్నారులు నిజాయితీని చాటుకుటన ఘటన సోమవారం చోటు చేసుకుంది. మండల కేంద్రంలో ముఖేష్ కరాటే అకాడమీలో కరాటే శిక్షణకు వెళ్తున్న కార్తీక్, కార్తికేయ, దిలీప్‌లకు పోస్టాఫీసు సమీపంలో రోడ్డుపై ఒక వెండి కాళ్ల పట్టీ దొరికింది. ఆ చిన్నారులు వెంటనే పోలీసు స్టేషన్‌కు వెళ్లి దొరికిన వస్తువును ఎస్ఐ వెంకటేశ్వర్‌గౌడుకు అప్పగించారు. చిన్నారులను ఎస్ఐ అభినందించారు.

జీపీఓగా బాధ్యతల స్వీకరణ

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల నూతన గ్రామ పాలనాధికారిగా (జీపీఓ)గా సోమవారం ఎట్టిరాజు బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్ సునీత, పంచాయతీ కార్యదర్శి సురేందర్ రెడ్డి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

కవిత విమర్శలకు సమాధానం చెప్పాలి

కల్వకుర్తి: ఎమ్మెల్సీ కవిత చేసిన విమర్శలకు దమ్ముంటే మాజీ మంత్రి కేటీఆర్ సమాధానం చెప్పాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయతి విజయ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కల్వకుర్తిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విమర్శలకు సమాధానం చెప్పలేని వారు ముఖ్యమంత్రిపై విమర్శలకు దిగడం విడ్డూరంగా ఉందన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల నుంచి నీరు రానప్పుడు గోదావరి నీళ్లు ఎత్తిపోస్తే అవి కాళేశ్వరం నీళ్లు ఎలా అవుతాయన్నారు. కమిషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని ఆరోపించారు. అయన వెంట బాలరాజు, జంగయ్య గౌడ్ లు ఉన్నారు.